

ఉత్పత్తులను పరిశీలిస్తున్న మోడల్స్

సిల్క్ ఇండియా వస్త్ర ప్రదర్శన ప్రారంభం

బంజారాహిల్స్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): శ్రీనగర్‌కాలనీ సత్యసాయి నిగమాగమంలో వెడ్డింగ్ కలెక్షన్‌తో కూడిన సిల్క్ ఇండియా వస్త్ర ప్రదర్శనను నగర మోడల్స్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "విభిన్నమైన హ్యాండ్లూమ్ చీరలతో పాటు ముఖ్యంగా సిల్క్ హ్యాండ్లూమ్, సిల్క్ వస్త్ర ఉత్పత్తులను ఒకే వేదికలో ప్రదర్శించడం అభినందనీయమన్నారు. చేనేతల నుంచి నేరుగా వినియోగదారుడికి అందించేందుకు ఏర్పాటైన ఈ ప్రదర్శనను ప్రతి ఒక్కరూ సందర్శించి, చేనేతకారులను ప్రోత్సహించాలని కోరారు. సిల్క్ ఇండియా మనసా ఆచార్య మాట్లాడుతూ, నేత కార్మికులను ప్రోత్సహించడంతో పాటు చేనేత పరిశ్రమకు మార్కెట్‌ను అందించడమే ఈ ప్రదర్శన ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ నెల 28వ తేదీ వరకు కొనసాగే ఈ ప్రదర్శనలో బెనారస్, జరీ, కోట, చందేరీ, కాశ్మీరి, మహేశ్వరి, వెంకటగిరి పట్టు, కంచి పట్టు, లక్నో చీరలు, డ్రెస్ మెటీరియల్స్ వంటి 30 వేల రకాల వస్త్ర ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయన్నారు.



దర్గా నిర్వాహకులతో ప్రార్థనల అనంతరం కార్పొరేటర్ విజయారెడ్డి, నాయకులు

ఘనంగా గ్యార్వీ ఉత్సవం

ఖైరతాబాద్, జనవరి22 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్‌లోని హజ్రత్ సయ్యద్ రజాషా సాహెబ్ కిబ్లా దర్గాలో గ్యార్వీ షరీఫ్ ఉత్సవం ఘనంగా జరిగింది. స్థానికులు పెద్ద సంఖ్యలో దర్గాలో మొక్కులు తీర్చుకున్నారు. కాంగ్రెస్ నాయకురాలు, కార్పొరేటర్ విజయారెడ్డి అతిథిగా హాజరై స్థానికులతో కలిసి ప్రార్థనల్లోను, అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలోను పాల్గొన్నారు. దర్గా నిర్వాహకులు అష్రఫ్, రాజు యాదవ్ పాల్గొన్నారు.

ఆభరణాలు చోరీ చేస్తున్న పాత నేరస్థురాలి అరెస్టు

పంజాగుట్ట, జనవరి 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న నగల దుకాణాలలో సిబ్బంది దృష్టి మరల్చి బంగారు ఆభరణాలు దొంగిలిస్తున్న పాత నేరస్థురాలిని పంజాగుట్ట పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లకుంట కోరంటి ప్రాంతానికి చెందిన ఎదులాబాద్ లక్ష్మి(60)నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న నగల దుకాణాలకు వెళ్లేది. బంగారు ఆభరణాలు కొనుగోలు చేస్తున్నట్టు నటిస్తూ అదను చూసుకుని చెవి రింగులు, గొలుసులు దొంగిలించేది. ఈ నెల 20న రాత్రి పంజాగుట్టలోని లలిత జ్యూవెల్లర్స్‌కు వెళ్లింది. సిబ్బందిని మాటలో పెట్టి, వారి దృష్టి మళ్లించి రూ.80వేల విలువ చేసే రెండు జతల బంగారు చెవి రింగులు దొంగలించింది. సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్న సిబ్బంది ఆమెను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. అనంతరం పంజాగుట్ట పోలీసులకు సమాచారం అందించి, ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని విచారించగా గతంలో మహంకాళి, మార్కెట్ పీఎస్‌ల పరిధిలో ఆభరణాలు దొంగిలించినట్టు తెలిపింది. నెల రోజుల క్రితం కూడా పంజాగుట్ట పీఎస్ పరిధిలో ఆభరణాలు దొంగలించినట్టు అంగికరించింది. ఆమె వద్ద నుంచి రెండు జతల బంగారు చెవి రింగులు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. న్యాయస్థానం అనుమతితో కస్టడీలోకి తీసుకుని మరో సారి ఆమెను విచారిస్తామని డీఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

ఐ ఫోన్ గెలుచుకున్నారంటూ బురిడీ

ప్రభుత్వ ఉద్యోగిని నుంచి రూ.1.47 లక్షలు కొట్టేసిన క్రిమినల్స్

హైదరాబాద్ సిటీ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఐ ఫోన్ గిఫ్టుగా గెలుచుకున్నారంటూ ఓ యువతిని బురిడీ కొట్టించిన సైబర్ నేరగాళ్లు రూ.1.47 లక్షలు కొట్టేశారు. డీసీపీ ధార కవిత తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన 25 ఏళ్ల యువతి ప్రభుత్వ ఉద్యోగిగా పని చేస్తోంది. నాలుగురోజుల క్రితం ఇన్‌స్టాగ్రామ్ చూస్తున్న క్రమంలో ఆమెకు కాస్మెటిక్స్‌కు సంబంధించిన ఒక షాపింగ్ వెబ్‌సైట్ కనిపించింది. ఆ వెబ్‌సైట్‌ను ఓపెన్ చేసి రూ. 2000 విలువైన కొన్ని రకాల కాస్మెటిక్స్ ఆర్డర్ చేసింది. మరుసటి రోజు ఒక గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి, 'కంగ్రాట్స్ మేడం.. మీరు షాపింగ్ చేసినందుకు గాను మా సంస్థ తరఫున తీసిన లక్కీడ్రాలో ఐ ఫోన్‌ను బహుమతిగా గెలుచుకున్నారు' అని చెప్పాడు. ఆ బహుమతిని పొందాలంటే మరో రూ. 3000 విలువైన కొనుగోళ్లు చేయాల్సి ఉంటుందన్నాడు. ఆ డబ్బు రీఫండ్ వస్తుందని నమ్మించాడు. ఓ లింక్ పంపాడు. ఆమె దాన్ని క్లిక్ చేసి, వారు చెప్పినట్లు రూ.3000 ఆన్‌లైన్ షాపింగ్ చేసింది. ఆమె ఫోన్‌ను హ్యాక్ చేసిన క్రిమినల్స్ డబ్బులు రీ ఫండ్ చేస్తున్నట్లు నమ్మించి ఆమె ద్వారా ఓటీపీలు తెలుసుకున్నారు. అలా మూడు విడతల్లో ఆమె ఖాతాలో ఉన్న రూ. 1,47,967 కొట్టేశారు. డబ్బులు డెబిట్ అయినట్లు మెసేజ్‌లు రావడంతో బాధితురాలు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు టెక్నిక్ ఎవిడెన్స్ ద్వారా దర్యాప్తు చేస్తున్నట్లు డీసీపీ తెలిపారు.

లారీ డ్రైవర్ అరెస్టు

పంజాగుట్ట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో లారీని రివర్స్ చేసి సిటీ బస్సును ఢీకొట్టి అద్దాలు ధ్వంసం చేసిన ఘటనలో లారీ డ్రైవర్‌ను పంజాగుట్ట పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 21న టీజీ10టి 1545 నెంబర్ గల సిటీ బస్సు సికింద్రాబాద్ నుంచి కొండాపూర్(10 హెచ్)వైపు వెళ్తోంది. అమీర్‌పేట కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద నుంచి వెళ్తుండగా మద్యం మత్తులో ఉన్న లారీ డ్రైవర్ రవి(ఏపీ23ఎక్స్3429)లారీని రివర్స్ చేస్తూ బస్సు ను ఢీకొట్టాడు. దీంతో బస్సు ముందు అద్దాలు పగిలిపోయాయి. బస్సు డ్రైవర్ మల్లేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు లారీ డ్రైవర్ రవిని అదుపులోకి తీసుకుని బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షించగా బీఏసీ 120 ఎంఎల్ వచ్చింది. పోలీసులు అతడిని అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు.

బెల్ట్ షాపులపై దాడులు

బోరబండ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జవహర్‌నగర్‌కు చెందిన వాక కమల కొంత కాలంగా గుట్టు చప్పుడు కాకుండా బెల్ట్‌షాప్ నిర్వహిస్తుంది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు బుధవారం మధురానగర్ పోలీసులు బెల్ట్‌షాపుపై దాడులు చేసి 34 90ఎంఎల్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కిరాణా వ్యాపారి హత్య కేసు.. పోలీస్ కస్టడీకి నిందితుడు

పంజాగుట్ట, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిగూడకు చెందిన కిరాణా వ్యాపారి విష్ణు రుపాని హత్య చేసిన ఘటనలో నిందితుడు రమేష్‌ను పంజాగుట్ట పోలీసులు న్యాయస్థానం అనుమతితో ఆరు రోజుల పాటు తమ కస్టడీలోకి తీసుకుని విచారించారు. డిసెంబరు 29న ఎల్లారెడ్డిగూడకు చెందిన కిరాణా వ్యాపారి విష్ణు రుపాని(45) అదృశ్యమై, జనవరి 1న శ్రీనివాసనగర్ ఈస్ట్‌కాలనీలోని ఓ గదిలో శవమై తేలాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసి విష్ణును హత్యచేసి మూడు తులాల బంగారు ఆభరణాలు, నగదును దోచుకెళ్లిన రమేష్‌ను ఈనెల 10న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. న్యాయస్థానం అనుమతితో అతడిని ఆరు రోజుల పాటు పంజాగుట్ట పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. అతన్ని విచారించారు. గత నెల 29న ఎక్కడెక్కడికి వెళ్లారు, విష్ణును హత్య చేసిన తర్వాత ఎక్కడికి వెళ్లాడు తదితర వివరాలు పోలీసులు స్వయంగా ఆయా ప్రాంతాలు తిరుగుతూ నమోదు చేశారు. సీన్ రీ కన్స్ట్రక్షన్ చేశారు. విష్ణును హత్య చేసిన తర్వాత అతని ద్విచక్ర వాహనాన్ని ట్రాన్స్‌పోర్టులో విజయవాడ, అక్కడి నుంచి తిరుపతికి తీసుకెళ్లినట్లు గుర్తించారు. తిరుపతిలో ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పలు వివరాలు సేకరించిన అనంతరం తిరిగి నిందితుడు రమేష్‌ను న్యాయస్థానంలో పోలీసులు హాజరు పరిచి, జైలుకు తరలించామని డీఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

నాడు అధ్వానంగా.. నేడు ఉద్యానవనంలా

- సకల సౌకర్యాలతో దనియాలగుట్ట హిందూ శ్మశానవాటిక అభివృద్ధి
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చొరవతో ఆధునిక హంగులు



ప్రస్తుతం ఆధునికంగా తీర్చిదిద్దిన శ్మశానవాటిక

బేగంపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా సరైన వసతులు లేక సమస్యలకు నిలయంగా మారిన బేగంపేటలోని దనియాలగుట్ట హిందూ శ్మశానవాటిక ప్రస్తుతం అన్ని హంగులతో ఉద్యానవనంలా మారింది. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రత్యేక దృష్టి సారించడంతోనే ఇది సాధ్యమైందని స్థానికులు చెబుతున్నారు.

రూ.8 కోట్ల నిధులతో అభివృద్ధి..

బేగంపేట అభివృద్ధి చెందుతున్న సమయంలో అప్పటి పెద్దలు దనియాలగుట్ట శివారులో ఉన్న కొంత స్థలాన్ని శ్మశాన వాటికగా వాడుకోవాలని భావించారు. అప్పటికే పెద్ద బండరాళ్లు, ముళ్ల పొదలతో నిండి ఉన్న ఈ స్థలాన్ని పలుమార్లు చదును చేసి వినియోగంలోకి తీసుకురావాలని బస్తీవాసులు భావించారు. అయితే కోర్టు కేసు ఉండటంతో న్యాయ పరమైన చిక్కులు ఎదురయ్యాయి. దీంతో స్థానికులు తమ కుటుంబ సభ్యులు మృతిచెందినప్పుడు రాళ్ల మధ్యనే అంతిమ సంస్కారాలు నిర్వహిస్తూ వచ్చారు. శ్మశానవాటిక కావాలని పదే పదే అధికారులకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయింది. విషయం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి వెళ్లడంతో ఎలాగైనా శ్మశాన వాటికను మహాప్రస్థానం మాదిరి తీర్చిదిద్దాలని ఆయన భావించారు. రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి 3.5 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించారు. గత ప్రభుత్వ హయాంలోనే శ్మశాన వాటిక అభివృద్ధి కోసం రూ.8 కోట్ల నిధులు కేటాయించారు. క్రమంగా వసతులు ఏర్పాటు కావడం మొదలయ్యాయి. పచ్చటి చెట్లు, విద్యుత్ దీపాలు, నీటి వసతి ఏర్పాటు చేశారు. సీసీ రోడ్లు నిర్మించడంతో పాటు మరుగు దొడ్లు, విశ్రాంతి గదులు, స్నానపు గదులు, అస్థికలను భద్రపరిచే గదులను నిర్మించారు. త్వరలోనే ఇది ప్రజలకు అందుబాటులోకి రానుంది. ప్రత్యేక చొరవ తీసుకుని సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే కృష్ణారావుకు స్థానికులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే పనులు



బస్తీ వాసులు 80 ఏళ్ల నుంచి శ్మశాన వాటిక అభివృద్ధి కోసం ఎదురు చూస్తున్నారు. ఈ విషయం నా దృష్టికి వచ్చింది. వెంటనే అప్పటి మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లాను. నగరం నడిబొడ్డున శ్మశాన వాటిక పరిస్థితి ఇంత దారుణంగా ఉండటం ఏంటని ఆయన విస్తుపోయారు. వెంటనే నిధులు కేటాయించారు. న్యాయ పరమైన చిక్కులు ఎదురైతే జైలుకు వెళ్లేందుకు సైతం సిద్ధమని స్థానికులు పట్టుదలతో ఉన్నారు. మొత్తానికి అందరి సహకారంతో స్మశాన వాటికను అభివృద్ధి చేసి అన్ని వసతులు సమకూర్చాం. మరికొన్ని నిధుల కోసం త్వరలోనే ప్రతిపాదనలు చేస్తాం. శ్మశానవాటికను అధికారికంగా ప్రారంభించకపోయినప్పటికీ స్థానికులకు వినియోగించుకుంటున్నారు.

- మాధవరం కృష్ణారావు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే

ఎమ్మెల్యే సహకారంతోనే అభివృద్ధి



కార్పొరేటర్‌గా అనేక పర్యాయాలు పనిచేశాను. అప్పట్లో ఈ శ్మశాన వాటికలో బోరు వేయాలని ప్రయత్నించినా సాధ్యం కాలేదు. దీంతో ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాల్సి వచ్చింది. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారం తో స్మశాన వాటికకు స్థలం కేటాయించడంతో పాటు రూ.8 కోట్ల నిధులతో అన్ని సౌకర్యాలు కల్పించాం.

- టి.మహేశ్వరి, బేగంపేట కార్పొరేటర్

పార్ట్ టైం ఉద్యోగం పేరిట రూ. 80 వేలు స్వాహా

బంజారాహిల్స్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పార్ట్ టైం ఉద్యోగం పేరిట సైబర్ నేరగాళ్లు 80 వేల రూపాయలకు మోసం చేశారు. గోల్కొండకు చెందిన రాజకుమార్ తప్పా వాచ్‌మెన్, గతేడాది అక్టోబర్‌లో అతనికి పార్ట్ టైం ఉద్యోగం పేరిట మెస్సెజ్ వచ్చింది. ఆ లింక్‌ను ఓపెన్ చేయగా, టెలిగ్రామ్ ఛానెల్‌కు వెళ్లింది. అక్కడ ఉద్యోగం కోసం రూ. 10 వేలు కావాలని అడిగారు. డబ్బు పంపించిన అనంతరం రకరకాల మెస్సెజ్‌లు రావడంతో వాటిని నమ్మి పలు దఫాలుగా 80 వేల రూపాయలు పంపించాడు. కానీ, జాబ్ రాలేదు. దీంతో మోసపోయినట్టు గ్రహించిన బాధితుడు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



డైరీ ఆవిష్కరణ

తెలంగాణ విద్యుత్ ఇంజనీర్ల సంఘం నూతన సంవత్సర 2025 డైరీ, క్యాలెండర్ బుధరవారం ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్రఅధ్యక్షుడు నెహ్రూ, ప్రధానకార్యదర్శి భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు. (హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి)

ఆర్టిజన్లకు న్యాయం చేసేవరకు పోరాటం ఆగదు: సీఐటీయూ



రాహార దీక్షలో కూర్చున్న ఆర్టిజన్ కార్మికులు

ఖైరతాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలో ఆర్టిజన్ కార్మికులకు కన్వర్షన్ డిమాండ్ సాధించే వరకు సీఐటీయూ వారికి అండగా ఉంటుందని ఆ సంఘం నేత, తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ రాష్ట్ర ఛైర్మన్ కె.ఈశ్వర్‌రావు తెలిపారు. జేఏసీ హైదరాబాద్‌సెంట్రల్ కమిటీ, దక్షిణ ప్రాంత కమిటీల ఆధ్వర్యంలో జరుగుతున్న మూడవ రోజు నిరాహార దీక్షలో పెద్ద ఎత్తున ఆర్టిజన్లు పాల్గొన్నారు. తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఈశ్వర్‌రావు మాట్లాడుతూ, తెలంగాణలో ఉన్న 20వేల మంది ఆర్టిజన్లకు విద్యార్హతల మేరకు జేఎల్ఎం, సబ్ ఇంజనీర్, జూనియర్ అసిస్టెంట్లుగా కన్వర్షన్ చేయాలని కోరారు. ఈనెల 24 వరకు రిలే దీక్షలు కొనసాగిస్తామని, ఆ తర్వాత ఫిబ్రవరి 3 నుంచి 13వ తేదీ వరకు జిల్లాల్లో కన్వర్షన్ యాత్రలు చేపడతామన్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఫిబ్రవరి 20వ తేదీన చలో విద్యుత్ సౌధ కార్యక్రమాన్ని చేపడతామని వెల్లడించారు. దీక్షలో నాయకులు ఎం. ధన్‌రాజ్, రాము, శంకర్ నాయక్, సైదులు గౌడ్, బాలకృష్ణ, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

- జీహెచ్ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్

హైదరాబాద్ సిటీ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ పరిధిలోని మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కార్మికులను కనీస వేతనం రూ. 26వేలు చెల్లించాలని జీహెచ్ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు జె.వెంకటేష్, తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్‌లు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ జీహెచ్ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఖైరతాబాద్ జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించారు. జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సూపర్‌వైజర్లకు రూ.35వేలు వేతనం ఇవ్వాలని, పెట్రోల్ అలవెన్సులు, ట్యాబ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో మరణిస్తున్న కార్మికులకు రూ. 25లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలన్నారు.

నవజాత శిశువుకు అరుదైన శస్త్ర చికిత్స



కోలుకుంటున్న శిశువును చూపిస్తున్న వైద్యులు

బంజారాహిల్స్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రాణాపాయ స్థితిలో ఉన్న నవజాతి శిశువుకు అరుదైన మిడగట్ వోల్వులస్ శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసి.. శిశువు ప్రాణాన్ని కాపాడారు మెడికవర్ ఉమెన్, చైల్డ్ హాస్పిటల్స్ వైద్యులు. ఆసుపత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ మధు మోహన్ రెడ్డి, డాక్టర్ రవీందర్ రెడ్డి, పరిగె డాక్టర్ నవిత ఎం, డా. వంశీరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మిడ్‌గట్ వాల్వులస్ విత్ మాల్‌రోటేషన్ అనేది ప్రాణాంతక పరిస్థితి. ఇది పుట్టుకతో వచ్చే జబ్బు అని, సకాలంలో గుర్తించి చికిత్స అందించాల్సి ఉంటుందన్నారు. 36 వారాల గర్భదారణ అనంతరం 1.79 కిలోల బరువుతో జన్మించిన ఆడ నవజాత శిశువును వాంతులు, మూత్రం తగ్గడం వంటి సమస్యలతో గతేడాది మెడికవర్ ఉమెన్స్ అండ్ చైల్డ్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. మిడ్‌గట్ వాల్వులస్ విత్ మాల్‌రోటేషన్ వ్యాధిగా గుర్తించిన వైద్యులు ఎన్ఐసీయూలో ఉంచి చికిత్స మొదలు పెట్టారు. వైద్య బృందం సుమారు 4 గంటల పాటు శ్రమించి శస్త్రచికిత్సను విజయవంతం చేసి నవజాత శిశువు ప్రాణాన్ని కాపాడారు. శస్త్ర చికిత్స అనంతరం శిశువుకు యాంటీ బయాటిక్స్, పోషకాహారం అందించడంతో వారంలోనే నోటి ద్వారా ఫీడ్‌ను అందించేలా పురోగతి సాధించిందని వైద్యులు తెలిపారు. .

హామీలను నెరవేరుస్తున్నాం

కార్పొరేటర్ విజయారెడ్డి

పంజాగుట్ట,జనవరి22(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని ఖైరతాబాద్ కార్పొరేటర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి. విజయారెడ్డి అన్నారు. బుధవారం ఏసీ గార్డ్స్‌లోని సంజయ్ గాంధీ మైదానంలో కోటి రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న హాకీ కోర్టు, చిన్న పిల్లల క్రీడా మైదానం, టూల్ రూమ్, ఓపెన్ జిమ్‌తో పాటు వాకింగ్ ట్రాక్ పనులను ఆమె పరిశీలించారు. అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

అగ్నిప్రమాద ప్రాంతం పరిశీలన



అమీర్‌పేట, జనవరి 22(ఆంధ్రజ్యోతి): బల్కంపేట రేణుకానగర్‌లో మంగళవారం రాత్రి గ్యాస్ గోడౌన్ వద్ద జరిగిన అగ్నిప్రమాదం విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ సరళ పార్టీ శ్రేణులతో కలిసి బుధవారం మధ్యాహ్నం సందర్శించి ప్రమాదానికి గల కారణాలను పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పవన్‌కుమార్, కాలనీ అధ్యక్షులు లాహోర్‌సింగ్, నాగేందర్, కిషన్‌లాల్, యాదగిరి, ప్రభు పాల్గొన్నారు.

'బాధితులకు ఉచిత శస్త్ర చికిత్స'

పంజాగుట్ట, జనవరి 22(ఆంధ్రజ్యోతి): డియర్ కృష్ణ మూవీ ద్వారా వచ్చిన ఆదాయంతో క్రానిక్ కన్స్ట్రక్టివ్ పెరికార్డిటిస్ వ్యాధితో బాధపడుతున్న వారికి ఉచితంగా శస్త్ర చికిత్స చేపిస్తామని ఆ సినిమా నిర్మాత పీఎన్ బలరాం తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తన కుమారుడు, నటుడు అక్షయ్ కృష్ణ, సహనటులు లోహిత్, సమీర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ నందు, డిస్ట్రిబ్యూటర్ సాయికిరణ్‌లతో కలిసి ఆయన వివరాలు వెల్లడించారు. డియర్ కృష్ణ సినిమా ఒక యదార్థ సంఘటన ఆధారంగా చేసుకుని తీయడం జరిగిందని అన్నారు. తన కుమారుడు అక్షయ్ కృష్ణ గుండె సంబంధిత క్రానిక్ కన్స్ట్రక్టివ్ పెరికార్డిటిస్ వ్యాధితో బాధపడుతుండే వాడని, పలు ప్రాంతాల్లో వైద్యులకు చూపించినా శస్త్రచికిత్స సాధ్యం కాదు, ఒక వేల చేసినా ఒక్క శాతం మాత్రమే బ్రతికే చాన్స్ ఉంటుందని చెప్పారని అన్నారు. ఏడు సంవత్సరాల క్రితం డాక్టర్ సునీల్, బృందం 22గంటల పాటు శ్రమించి అతి సంక్లిష్టమైన ఓపెన్ హార్ట్ సర్జరీ చేశారని, దీని కోసం సుమారు 35లక్షల రూపాయలు ఖర్చు అయ్యిందని అన్నారు. ఈ వ్యాధితో బాధపడుతున్న పేదరికంలో ఉన్న 20 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న యువతీ యువకులకు ఉచితంగా శస్త్ర చికిత్స చేయించడానికి తాను సిద్ధంగా ఉన్నానని బలరాం తెలిపారు. తన కుమారుడే హీరోగా అతను అనుభవించిన బాధను, శస్త్ర చికిత్స ఎలా బతికి బయటపడ్డాడో తదితర సన్నివేశాలను డియర్ కృష్ణ సినిమాలో చిత్రీకరించడం జరిగిందని అన్నారు. ఈ నెల 24న సినిమా రిలీజ్ అవుతుందని, ఈ సినిమా ద్వారా వచ్చిన ఆదాయంతో క్రానిక్ కన్స్ట్రక్టివ్ పెరికార్డిటిస్ వ్యాధితో బాధపడుతున్న వారికి శస్త్ర చికిత్స చేయిస్తానని, ఒక వేల ఆదాయం రాకున్నా ఒక్కరికి మాత్రం సొంత ఖర్చులతో కేరళలోని అమృత ఆస్పత్రిలో చేపిస్తానని అన్నారు. తమ సినిమాను ప్రోత్సహించాలని కోరారు.

ఆర్టీఏ కార్యాలయంలో వైద్య శిబిరం

- ఇద్దరికి రొమ్ము కేన్సర్ పరీక్షలకు సిఫారసు

హైదరాబాద్ సిటీ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా రవాణా శాఖ ఆర్టీఏ కార్యాలయాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తోంది. బుధవారం ఖైరతాబాద్‌లోని ఆఫీసులో నిర్వహించిన శిబిరంలో డ్రైవర్లు, వివిధ సేవల నిమిత్తం వచ్చిన పౌరులు 220మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇద్దరు మహిళలను రొమ్ము కేన్సర్ వైద్య పరీక్షల నిమిత్తం సిఫారసు చేశారు. 48మంది అధిక రక్త పోటు, 35మంది మధుమేహంతో బాధపడుతున్నట్టు గుర్తించారు. నలుగురికి నిర్ణీత స్థాయి కంటే తక్కువ హిమోగ్లోబిన్ ఉందని, కంటి సమస్యలు 14మందికి, పంటి సమస్యలు 58మందికి ఉన్నట్టు గుర్తించారు. 95మందికి అవసరమైన మందులు అందజేశారు. కొందరు వ్యక్తులకు బీపీ, షుగర్, కంటి సమస్యలు వంటివి ఉన్నట్టు గుర్తించారు.

'మిస్ ట్రాన్స్' ఫ్యాషన్ షో పోస్టర్ ఆవిష్కరణ

పంజాగుట్ట, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరికి ఫ్యాషన్ రంగంలో అవకాశాలు ఎక్కువగా ఉంటాయని నగరంలో మొదటిసారిగా ఐకానిక్ స్టార్స్ మిస్ ట్రాన్స్ తెలంగాణ ఫ్యాషన్ షో-2025ను నిర్వహిస్తున్నామని నిర్వాహకుడు శ్రీనాథ్ తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో హైదరాబాద్ మోడల్ సీఈఓ,ఫ్యాషన్ డైరెక్టర్ వంశీ పల్లె, మిస్ యూనివర్స్ ట్రాన్స్ ఇండియా హర్షిణి, ట్రాన్స్ డాక్టర్ ప్రాచి రాథోడ్, చంద్రస్వామి, నిర్మాత నవీన్‌గౌడ్‌లతో కలిసి అంతర్జాతీయ మహిళా దినోత్సవం తర్వాత నగరంలో నిర్వహించనున్న ఐకానిక్ స్టార్స్ మిస్ ట్రాన్స్ తెలంగాణ ఫ్యాషన్ షో-2025 పోస్టరును ఆవిష్కరించారు. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న ట్రాన్స్ జెండర్స్ ఈ ఫ్యాషన్ షోలో పాల్గొనడానికి అర్హులని శ్రీనాథ్ తెలిపారు. ఇందులో గెలుపొందిన వారికి నగదు బహుమతి, కిరీటం, సర్టిఫికెట్, యూ ట్యూబ్‌లో వీడియోలో సాంగ్, ప్రోమో చేసి ఇస్తామని అన్నారు. షోలో పాల్గొనే వారికి వివిధ అంశాలలో పోటీ ఉంటుందని అన్నారు. మిస్ యూనివర్స్ ట్రాన్స్ ఇండియా హర్షిణి మేకల మాట్లాడుతూ ట్రాన్స్ అంటేనే తమను వేరే రకంగా చూస్తారని, తమకు అవకాశం కల్పిస్తే ఎవరికీ తీసిపోని విధంగా అన్ని రంగాల్లో రాణిస్తామని అన్నారు. పోటీలో పాల్గొనే వారు మార్చి 1 వరకు 9010691111 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవచ్చునని శ్రీనాథ్ తెలిపారు. సమావేశంలో నటుడు కామేశ్ గౌడ్, బన్నీ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్

బోరబండ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఓ ప్రయాణికురాలు ఆటోలో మర్చిపోయిన నాలుగు తులాల బంగారు ఆభరణాలున్న బ్యాగ్‌ను ఆటో డ్రైవర్ పోలీసులకు అందజేసి నిజాయితీ చాటుకున్నాడు. బోరబండ సీఐ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. జీటీఎస్ కాలనీకి చెందిన జ్యోతి హైటెక్ సిటీ నుంచి ఖానామెంట్ వరకు టీఎస్34టి 8508 ఆటోలో ప్రయాణించింది. ఆటోలో నగలు ఉన్న బ్యాగును ఆమె మర్చిపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీఫుటేజ్ ఆధారంగా ఆటో డ్రైవర్ ఫోన్ నంబర్ సేకరించి మాట్లాడగా వెంటనే ఆటో డ్రైవర్ సాయికిరణ్‌నాయక్ నాలుగు తులాల నగలను బోరబండ పోలీసులకు అప్పచెప్పాడు. జ్యోతిని పోలీస్ స్టేషన్‌కి పిలిచి నగలను సీఐ ఆమెకు అందజేశారు.

ప్రాణభయం ఉందని ఫిర్యాదు

బోరబండ: హరీష్ శ్వేతి నుంచి ప్రాణభయం ఉందని ఓ మహిళ మధురానగర్ పోలీసులను ఆశ్రయించింది. వివరాల ప్రకారం.. మధురానగర్ మెట్రోస్టేషన్ వద్ద ఆగ్రా స్వీట్ షాప్ యజమాని అనామికగోష్, మంగళవారం ఉదయం షాపును తెరవడానికి వెళ్లింది. అప్పటికే అక్కడ ఉన్న నలుగురు యువకులు అనామిక గోష్‌ను షాపు తెరవొద్దంటూ బెదిరింపులకు దిగారు. షాపులో పనిచేసే కార్మికులు వచ్చి ఆ యువకులను బతిమలాడినా ఫలితంలేదు. మీరెవరు మమ్మల్ని ఎందుకు బెదిరిస్తున్నారని అనామిక ఘోష్ ప్రశ్నించగా మమ్ములను హరీష్ శ్వేతి పంపాడని చెప్పడంతో మధురానగర్ పోలీసులకు అనామిక గోష్ ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.




తిరుమలగిరి ఆర్టీఓ కార్యాలయంలో మాట్లాడుతున్న కమిషనర్ సురేంద్రమోహన్

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలకు చెక్

● ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సురేంద్రమోహన్

తిరుమలగిరి జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా తిరుమలగిరిలోని ఆర్టీఏ కార్యాలయంలో బుధవారం ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సురేంద్రమోహన్ మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలను నడపరాదని, సీట్‌బెల్ట్ ధరించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ వాహనాలను నడిపితే ప్రమాదాలను నివారించవచ్చని కమిషనర్ అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ జెడీటీసీ రమేష్, హైదరాబాద్ జెడీటీసీ చంద్రశేఖర్, ఐటీ విజిలెన్స్ మధుసూదన్, ఐటీ మేనేజర్ ఎర్ర స్వామి, ఆర్టీఏ తిరుమలగిరి జయచందర్ ఎంవీఐ, నేహా ఎంవీఐ, అవినాష్ ఎంవీఐ, లావణ్య ఎంవీఐ, రోడ్డు సేఫ్టీ అధికారి సారధి తదితరులు పాల్గొన్నారు.

'మై ఆటో ఈజ్ సేఫ్ స్టిక్కర్' అతికించుకోవాలి

రెజిమెంటల్‌బజార్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆటో నడిపే వారు విధిగా "మై ఆటో ఈజ్ సేఫ్" స్టిక్కర్ కనపడేలా అతికించుకోవాలని గోపాలపురం ట్రాఫిక్ ఎస్సై సతీష్ రెడ్డి ఆటో డ్రైవర్లకు సూచించారు. సికింద్రాబాద్ రేతిఫైల్ బస్‌స్టేషన్‌లో బుధవారం ఆటో అడ్డాలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్‌తో పాటు స్టిక్కర్‌పై అవగాహన కల్పించారు. బేగంపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వివరాలు అందించి స్టిక్కర్‌ను తీసుకోవాలని ఆటో డ్రైవర్లకు సూచించారు. "మై ఆటో ఈజ్ సేఫ్"తో ప్రయాణికులకు భద్రతతో కూడిన ప్రయాణం, అదే విధంగా ఏదైనా సంఘటన జరిగినప్పుడు సులభంగా ఆటోను గుర్తించేందుకు ఉపయోగపడుతుందని ఎస్ఐ తెలిపారు.

ట్రాఫిక్, పారిశుధ్య సమస్యలకు ప్రాధాన్యం

● సమీక్షా సమావేశంలో అధికారుల నిర్ణయం

సికింద్రాబాద్, జనవరి22(ఆంధ్రజ్యోతి): ఒక వైపు ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెడుతూ మరోవైపు పారిశుధ్య నిర్వహణ తదితర పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయా విభాగాల ఉన్నతాధికారుల సమావేశంలో నిర్ణయించారు. బుధవారం సికింద్రాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ (జెడ్సీ) కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో జెడ్సీ రవికిరణ్, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, సికింద్రాబాద్ కంటోన్మెంట్ జాయింట్ సీఈఓ పల్లవి, కంటోన్మెంట్ చీఫ్ సిటీ ప్లానర్ ఫణికుమార్, ఎస్ఈ రత్నాకర్, సిటీ ప్లానర్ రఘునందన్, ప్రాజెక్ట్స్ ఈఈ రోహిణి, బేగంపేట సర్కిల్ ఉపకమిషనర్ సమ్మయ్యతో పాటు విద్యుత్, వాటర్‌బోర్డు తదితర విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్యాట్నీ, సంగీత్, వైఎంసీఏ కూడళ్లలో స్టాప్‌లైన్ల మార్కింగ్ చేయాలని, మయూర్ మార్గ్‌లో ట్రీ రీలోకేషన్ చేయాలని, వివిధ ప్రాంతాల్లో సైన్‌బోర్డులు, యూటర్న్, ట్రాఫిక్ సూచికలు ఏర్పాటుకు అంచనాలు రూపొందించాలని, పద్మాకాలనీ, నాగమయ్యకుంట ప్రాంతాల్లో విద్యుత్ కేబుల్స్‌మార్పు, గాంధీ ఆస్పత్రి వద్ద మట్టికుప్పల తొలగింపు, ఆయా ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ, ఫుట్‌పాత్‌ల నిర్మాణం, పారిశుధ్య నిర్వహణ మెరుగుపర్చటం తదితర అంశాలపై సమీక్షించారు.

కేంద్రం నుంచి మరిన్ని నిధులు తీసుకొస్తాం: రామకృష్ణ

బోయిన్‌పల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ అభివృద్ధికి కేంద్రం నుండి మరిన్ని నిధులు తీసుకొస్తామని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో కంటోన్మెంట్ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసి ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె. రామకృష్ణ అన్నారు. బుధవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ 6వ వార్డు పరిధిలోని ఇక్రిశాట్ కాలనీలో స్థానికులతో కలిసి కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తెలుసుకున్నారు. 6వ వార్డు బీజేపీ అధ్యక్షుడు ప్రతీక్ జైన్, సీనియర్ నాయకులు అజయ్ గౌడ్, రవీంధర్ రెడ్డి, కాలనీవాసులు సోమేశ్వర్, శివకాంత్ గౌడ్, కంటోన్మెంట్ బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.


ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళా న్యాయవాదులు

సికింద్రాబాద్ సివిల్ కోర్టులో ముగ్గుల పోటీలు

అడ్డగుట్ట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : వృత్తితో పాటు అన్ని రంగాల్లోను మహిళా న్యాయవాదులు రాణించాలని సికింద్రాబాద్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ మహిళా ప్రతినిధి పుష్పలత అన్నారు. బుధవారం సికింద్రాబాద్ సివిల్ కోర్టు ఆవరణలో మహిళా న్యాయవాదులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్పలత మాట్లాడుతూ,సివిల్ కోర్టు చరిత్రలోనే తొలిసారిగా ఇక్కడ ముగ్గుల పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. పోటీల్లో మహిళా న్యాయవాదులు సమత, మహేశ్వరి, అర్చన, రత్నకుమారి, మహేశ్వరి, కీర్తి, నాగరాణి, జయశ్రీ, ఫిజా, సబిత, షీలా బోస్లేలు పాల్గొనగా మొదటి విజేతగా షాలిని, రెండు, మూడు, నాల్గవ విజేతలుగా జయశ్రీ, ప్రవల్లిక, కీర్తి నిలిచారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై. వసంత్ కుమార్, హిమవర్ష, సౌమ్యతో పాటు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


మేడిబావిలో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల సర్వేలో పాల్గొన్న జీహెచ్‌ఎంసీ ఉపకమిషనర్ సుభాష్‌రావు, కార్పొరేటర్ సామల హేమ తదితరులు

'దళారులను నమ్మి మోసపోవద్దు'

బౌద్ధనగర్, జనవరి22(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ మేడిబావి తదితర ప్రాంతాల్లో బుధవారం జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ ఉపకమిషనర్ సుభాష్‌రావు, స్థానిక కార్పొరేటర్ సామల హేమ, వార్డు ఇన్‌చార్జి సంధ్యారాణి తదితరులు పర్యటించారు. కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లపై ప్రజలకు వారు అవగాహన కల్పించారు. అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు మంజూరు చేస్తుందని తెలిపారు. దళారులను నమ్మి ఎవ్వరూమోసపోవద్దని సూచించారు. అనంతరం నామాలగుండు వార్డు కార్యాలయంలో పెండింగ్ సమస్యలపై సమావేశాన్ని నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తిచేయాలని కార్పొరేటర్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈ కౌశిక్‌రెడ్డి, నాయకులు కరాటే రాజు తదితరులు పాల్గొన్నారు.

నాడు అధ్వానంగా.. నేడు ఉద్యానవనంలా

● సకల సౌకర్యాలతో దనియాలగుట్ట హిందూ శ్మశానవాటిక అభివృద్ధి
● ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చొరవతో ఆధునిక హంగులు

బేగంపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా సరైన వసతులు లేక సమస్యలకు నిలయంగా మారిన బేగంపేటలోని దనియాలగుట్ట హిందూ శ్మశానవాటిక ప్రస్తుతం అన్ని హంగులతో ఉద్యానవనంలా మారింది. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రత్యేక దృష్టి సారించడంతోనే ఇది సాధ్యమైందని స్థానికులు చెబుతున్నారు.

రూ.8 కోట్ల నిధులతో అభివృద్ధి..

బేగంపేట అభివృద్ధి చెందుతున్న సమయంలో అప్పటి పెద్దలు దనియాలగుట్ట శివారులో ఉన్న కొంత స్థలాన్ని శ్మశాన వాటికగా వాడుకోవాలని భావించారు. అప్పటికే పెద్ద బండరాళ్లు, ముళ్ల పొదలతో నిండి ఉన్న ఈ స్థలాన్ని పలుమార్లు చదును చేసి వినియోగంలోకి తీసుకురావాలని బస్తీవాసులు భావించారు. అయితే కోర్టు కేసు ఉండటంతో న్యాయ పరమైన చిక్కులు ఎదురయ్యాయి. దీంతో స్థానికులు తమ కుటుంబ సభ్యులు మృతిచెందినప్పుడు రాళ్ల మధ్యనే అంతిమ సంస్కారాలు నిర్వహిస్తూ వచ్చారు. శ్మశానవాటిక కావాలని పదే పదే అధికారులకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయింది. విషయం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి వెళ్లడంతో ఎలాగైనా శ్మశాన వాటికను మహాప్రస్థానం మాదిరి తీర్చిదిద్దాలని ఆయన భావించారు. రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి 3.5 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించారు. గత ప్రభుత్వ హయాంలోనే శ్మశాన వాటిక అభివృద్ధి కోసం రూ.8 కోట్ల నిధులు కేటాయించారు. క్రమంగా వసతులు ఏర్పాటు కావడం మొదలయ్యాయి. పచ్చటి చెట్లు, విద్యుత్ దీపాలు, నీటి వసతి ఏర్పాటు చేశారు. సీసీ రోడ్లు నిర్మించడంతో పాటు మరుగు దొడ్లు, విశ్రాంతి గదులు, స్నానపు గదులు, అస్థికలను భద్రపరిచే గదులను నిర్మించారు. త్వరలోనే ఇది ప్రజలకు అందుబాటులోకి రానుంది. ప్రత్యేక చొరవ తీసుకుని సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే కృష్ణారావుకు స్థానికులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



ప్రస్తుతం ఆధునికంగా తీర్చిదిద్దిన శ్మశానవాటిక



గతంలో ముళ్ల చెట్లు పెరిగి ఉన్న శ్మశాన వాటిక ప్రాంతం.. (ఫైల్)


పూల మొక్కలతో సుందరంగా..

బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే పనులు



బస్తీ వాసులు 80 ఏళ్ల నుంచి శ్మశాన వాటిక అభివృద్ధి కోసం ఎదురు చూస్తున్నారు. ఈ విషయం నా దృష్టికి వచ్చింది. వెంటనే అప్పటి మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లాను. నగరం నడిబొడ్డున శ్మశాన వాటిక పరిస్థితి ఇంత దారుణంగా ఉండటం ఏంటని ఆయన విస్తుపోయారు. వెంటనే నిధులు కేటాయించారు. న్యాయ పరమైన చిక్కులు ఎదురైతే జైలుకు వెళ్లేందుకు సైతం సిద్ధమని స్థానికులు పట్టుదలతో ఉన్నారు. మొత్తానికి అందరి సహకారంతో స్మశాన వాటికను అభివృద్ధి చేసి అన్ని వసతులు సమకూర్చాం. మరికొన్ని నిధుల కోసం త్వరలోనే ప్రతిపాదనలు చేస్తాం. శ్మశానవాటికను అధికారికంగా ప్రారంభించకపోయినప్పటికీ స్థానికులకు వినియోగించుకుంటున్నారు. - మాధవరం కృష్ణారావు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే

ఎమ్మెల్యే సహకారంతోనే అభివృద్ధి



కార్పొరేటర్‌గా అనేక పర్యాయాలు పనిచేశాను. అప్పట్లో ఈ శ్మశాన వాటికలో బోరు వేయాలని ప్రయత్నించినా సాధ్యం కాలేదు. దీంతో ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాల్సి వచ్చింది. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారం తో స్మశాన వాటికకు స్థలం కేటాయించడంతో పాటు రూ.8 కోట్ల నిధులతో అన్ని సౌకర్యాలు కల్పించాం.

- టి.మహేశ్వరి, బేగంపేట కార్పొరేటర్

తులం బంగారం హామీని ఎప్పుడు అమలు చేస్తారు?

● ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాద్

రాంగోపాల్‌పేట్, జనవరి22 (ఆంధ్ర జ్యోతి): తులం బంగారం హామీని ఎప్పుడు అమలు చేస్తారో స్పష్టం చేయాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సర్దార్‌పటేల్ రోడ్డులోని సికింద్రాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో 108 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల ముందు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ఇవ్వడం లేదని పలువురు లబ్ధిదారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన ఆయన లబ్ధిదారుల తరఫున నివేదికను అందజేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం తలసాని మాట్లాడుతూ.... పేద, మధ్య తరగతి కుటుంబాల వారికి ఆడబిడ్డ పెళ్లి అంటే ఆర్థికంగా ఎంతో భారమన్నారు. ఈ నేపథ్యంలోనే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పేదలకు లక్షా116 రూపాయల ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని చెప్పారు. ఈ పథకాల ద్వారా లక్షలాది కుటుంబాలకు ఈ ఆర్థిక సాయం అందించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న తులం బంగారం హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ తహసీల్దార్ ఇస్లావత్ పాండు నాయక్, కార్పొరేటర్లు టి.మహేశ్వరి, కుర్మ హేమలత, మాజీ కార్పొరేటర్ అతెల్లి మల్లికార్జున్ గౌడ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు అతెల్లి శ్రీనివాస్ గౌడ్, ఆకుల హరికృష్ణ, శ్రీనివాస్ గౌడ్, వెంకటేషన్ రాజు, ఉజ్జయినీ మహంకాళి దేవస్థాన మాజీ ధర్మకర్త కొశికె కిషోర్ కుమార్ పాల్గొన్నారు.


లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

ఫుట్‌పాత్ వ్యాపారుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలి

● ఎమ్మెల్యే తలసాని

సికింద్రాబాద్, జనవరి22(ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్ వ్యాపారుల పట్ల ప్రభుత్వం, అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. నియోజకవర్గ పరిధిలో వందలాది మంది ఫుట్‌పాత్ వ్యాపారులు, హాకర్లు మంగళవారం మారేడుపల్లి కార్యాలయంలో తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి తమ బాధను తెలిపి కన్నీటి పర్యంతమయ్యారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆయన జీహెచ్‌ఎంసీ నార్త్ జోన్ కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీస్ అధికారులతో సమావేశమయ్యారు. 50 ఏళ్ల నుంచి ఫుట్‌పాత్‌లపై, తోపుడుబండ్లపై వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, ఫుట్‌పాత్‌లపై నుంచి తొలగిస్తే వారి కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. ట్రాఫిక్కు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఫుట్‌పాత్ వ్యాపారుల జీవనోపాధికి భంగం కలగకుండా చూడాలని అధికారులను ఎమ్మెల్యే కోరారు. గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఫుట్‌పాత్ వ్యాపారులకు అవసరమైన ఆదేశాలు, సూచనలు చేయాలని నిర్ణయించారు. సమావేశంలో జోనల్ కమిషనర్ రవికిరణ్, ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు, బేగంపేట డివిజన్ కార్పొరేటర్ టి.మహేశ్వరి, డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, టౌనిప్లానింగ్ ఏసీపీ సుస్మిత, బేగంపేట,మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, మాజీ కార్పొరేటర్ అత్తెల్లి మల్లికార్జున్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఆకుల హరికృష్ణ, నాయకులు అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్, నాగులు, కిషోర్, శేఖర్, మహేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌కు నేతల పరామర్శ

● ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న కేటీఆర్, హరీశ్‌రావు, కవిత, ఈటల తదితరులు

రెజిమెంటల్‌బజార్/బౌద్ధనగర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): డెహ్రాడూన్‌కు వెళ్లి గుండెపోటుకు గురై మంగళవారం రాత్రి నగరానికి చేరుకున్న సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ల పద్మారావుగౌడ్‌ను బుధవారం సికింద్రాబాద్‌లోని ఆయన నివాసంలో పలువురు పరామర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మల్కాజగిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, పువ్వాడ అజయ్ కుమార్, భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, పార్లమెంట్ సభ్యులు రవిచంద్ర, డాక్టర్ దాసోజు శ్రావణ్‌కుమార్, బాల్క సుమన్, సలీం, మాజీ స్పీకర్, శాసన మండలి విపక్షనేత మధుసూధనాచారి, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తోపాటు కార్పొరేటర్లు కొంతం దీపిక, సామల హేమ, కంది శైలజ పరామర్శించారు.


పద్మారావును పరామర్శిస్తున్న కేటీఆర్, తలసాని, పువ్వాడ అజయ్ కుమార్, కవిత తదితరులు

ఆరోగ్యం మెరుగుపడింది

● వెల్లడించిన పద్మారావుగౌడ్ కుమారుడు

బీఆర్ఎస్ యువనేత, పద్మారావుగౌడ్ తనయుడు తీగుళ్ల రామేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ, తన తండ్రి పద్మారావుగౌడ్‌కు గుండెపోటు రావటంతో కుటుంబసభ్యులు, బీఆర్ఎస్ ముఖ్యనాయకులు, కార్యకర్తలు ఆందోళనకు గురు య్యామని అన్నారు. ప్రస్తుతం తన తండ్రి ఆరోగ్యం మెరుగుపడిందని,. ఎవ్వరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని, కొన్ని రోజులు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారని తెలిపారు. బుధవారం ఉదయం సీతాఫల్‌మండిలోని సికింద్రాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి పలువురు నాయకులు, కార్యకర్తలు, మహిళలు వచ్చి పద్మారావుగౌడ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పలువురు మహిళలు కన్నీటిపర్యంతమయ్యారు..


పద్మారావుగౌడ్‌ను పరామర్శిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్, కార్పొరేటర్ కొంతం దీపిక తదితరులు


పద్మారావుగౌడ్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తదితరులు


వినతిపత్రం ఇస్తున్న మహిళా మోర్చా జాయింట్ కోశాధికారి విశాలిని

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి

మారేడుపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తరచూ ఏర్పడుతున్న డ్రైనేజీ సమస్యపై జలమండలి అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా శాశ్వత పరిష్కారం చేయడం లేదని, నామమాత్రంగా మరమ్మతులు చేసి ప్రజలను మభ్యపెడుతున్నారని బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా జాయింట్ కోశాధికారి కె.విశాలిని ఆరోపించారు. బుధవారం ఆమె మారేడుపల్లి జలమండలి కార్యాలయంలో జలమండలి జీఎం వినోద్ కుమార్, జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌లను కలిసి డ్రైనేజీ, రోడ్ల మరమ్మతు పనులను చేపట్టాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. ఈస్ట్ మారేడుపల్లి, టీచర్స్ కాలనీ, అంబేడ్కర్ నగర్ బస్తీ, ఎల్. శంకర్‌నగర్ ప్రాంతాలలో కొన్నేళ్లుగా ఉన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వినతి పత్రంలో కోరారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారని ఆమె చెప్పారు. కార్యక్రమంలో శ్రీనివాస్, బాలు, నాగేష్, నర్సింగ్ పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యార్థి ఆత్మహత్య


అర్పిత(ఫైల్)

రెజిమెంటల్‌బజార్,జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఫార్మసీ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన మార్కెట్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ నాలాబజార్‌కు చెందిన టింగ్రే అర్పిత ఫార్మసీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. రోజు మాదిరిగానే మంగళవారం కాలేజ్‌కు వెళ్లి వచ్చింది. ఇంట్లో ఎవరు లేని సమయంలో చీరతో ఉరేసుకుంది. పనికి వెళ్లి వచ్చిన తల్లి ఎన్నిసార్లు తలుపు కొట్టినా తీయలేదు. దీంతో బలవంతంగా డోరు తెరచి చూడగా బెడ్‌రూమ్‌లో అర్పిత ఉరేసుకుని కనిపించింది. వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మార్కెట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.మృతురాలి కుటుంబాన్ని కార్పొరేటర్ కొంతం దీపిక ఓదార్చి, ధైర్యం చెప్పారు.

అత్యాచారం కేసులో నిందితుడికి రిమాండ్

రాంగోపాల్‌పేట్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అత్యాచారం కేసులో నిందితుడికి కోర్టు 14 రోజుల రిమండ్ విధించింది. మహంకాళి పోలీస్ ఇన్‌స్పెక్టర్ పరశురామ్ తెలిపిన వివరాల ప్రకారం ... పార్క్‌లేన్ వద్ద గల ఇన్నోవేటివ్ టెక్ ప్యాక్ లిమిటెడ్ సీఎండీ కె.సాయాజీ రావు (65) 2018 నుంచి 2024 ఏప్రిల్ వరకు తనపై పలుమార్లు బలవంతంగా అత్యాచారం చేశాడని అదే సంస్థలో పనిచేస్తున్న బాధితురాలు ఈ నెల 16న ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ జరిపి మంగళ వారం సాయాజీరావుపై బీఎన్ఎస్ 376(2), 420, 504, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి బుధవారం 11 ఎంఎం మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. నిందితుడికి మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు.

వడ్డెర బస్తీలో వ్యక్తి అదృశ్యం


అదృశ్యమైన స్వామి

అడ్డగుట్ట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ శంకర్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. తుకారాంగేట్ వడ్డెరబస్తీకి చెందిన స్వామి (40) గత సోమవారం ఉదయం బయటికి వెళ్తున్నానని ఇంట్లో వారికి చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. ఆ రోజు రాత్రి వరకు రాకపోవడంతో భార్య సంగీత బంధువులు, స్నేహితుల ఇళ్లలో వాకబు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో మరుసటి రోజు భార్య తన భర్త కనిపించడం లేదని తుకారాంగేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, డీడీ ఎంట్రీ చేశారు. బుధవారం స్వామి మిస్సింగ్ అయినట్టు కేసు కింద నమోదు చేశారు. స్వామి ఆచూకీ ఎవరికైనా తెలిస్తే తుకారాంగేట్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

అడ్డగుట్ట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లో ఫుట్‌పాత్‌పై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై మాదవి తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ క్లాక్ టవర్ సమీపంలోని అబిజిత్ వైన్స్ సమీపంలోని ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని 35 ఏళ్ల వ్యక్తి చనిపోయి ఉండగా స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే వెంటనే గోపాలపురం పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.